ప్రజాశక్తి
ఆదివారం 3 ఆగస్టు, 2025
5
శ్రీకాకుళం

ఎమ్మెల్సీ శ్రీనివాస్‌కు నోటీసులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు హిరమండలం పోలీసులు శనివారం నోటీసులు జారీచేశారు. గతంలో జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను చంద్రబాబు దగ్గర రూ.50 కోట్లు నెలకు తీసుకుని ప్రశ్నించడం లేదని ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో జనసేన నాయకులు హిరమండలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు నోటీసులు జారీ చేశారు.

నోటీసును అందజేస్తున్న పోలీసు

రైతు సంక్షేమమే ధ్యేయం

- జిల్లాలో 2,79,100 మందికి 'అన్నదాత సుఖీభవ'
- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి- లావేరు

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. లావేరులో అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సంక్షేమం ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తుందని అన్నారు. అన్నదాతలకు అన్నివిధాలా అండగా ఉంటామని చెప్పారు. మొదటి విడతగా జిల్లాలో 2,79,100 మంది రైతు కుటుంబాల్లోని బ్యాంకు ఖాతాల్లో రూ.186.13 కోట్లు జమ చేశామని అన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో 48,103 మంది రైతు కుటుంబాలకు రూ.31.898 కోట్లు వారి ఖాతాల్లో చేశామని చెప్పారు. రైతులకు ఉన్న ప్రతి ఎకరాకూ సాగుచేసుకొనేందుకు తోడ్పాటు అందించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని అన్నారు. అన్నివిధాలా రైతులను ఆదుకునేందుకు రాయితీపై విత్తనాలు ఎరువులు పురుగు మందుల డ్రిప్ యంత్రలు డ్రోన్లు అందజేశామని అన్నారు. గత వైసిపి పాలనలో రైతులకు అన్నివిధాలా నష్టం చేకూర్చిందన్నారు డ్రిప్ ఇరిగేషన్ యంత్రాలు ఇవ్వకుండా రైతులు పొట్టకొట్టిందని విమర్శించారు. ఇటీవల తల్లికి వందనం, ప్రస్తుతం అన్నదాత సుఖభావ, త్వరలోనే మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం అమలు చేస్తామని అన్నారు. కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు రైతులు దారపురెడ్డి కూర్మారావు, మాకన కృష్ణ, పళ్లంటి చిట్టిబాబులకు అన్నదాత సుఖిభవ చెక్కులను అందజేశారు. తొలుత సమావేశం ప్రాంగణం వద్ద మొక్కలు నాటి డ్రోన్‌ను ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగాన్ని తిలకించారు. కార్యక్రమంలో జెసి అహ్మద్ ఫర్మాన్‌ఖాన్, ఆర్‌డిఒ సాయిప్రత్యూష, వ్యవసాయశాఖ జెడి కె.త్రినాథస్వామి, ఎడిఎ వడ్డాది శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్, ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, టిడిపి జిల్లా మాజీ అధ్యక్షులు చౌదరి బాబ్జి పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఇన్‌ఛార్జి మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి విడనాడాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సమాఖ్య (ఫ్యాప్టో) పిలుపుమేరకు శనివారం కలెక్టరేట్ వద్ద ధర్నా, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ కార్యదర్శి, జిల్లా విద్యాశాఖ అధికారులకు ఇప్పటికే ఉపాధ్యాయ సంఘాలు నోటీసులు అందజేశాయి. నిరసన వ్యక్తం చేసిన వీరు తమ డిమాండ్లు నెరవేర్చకుంటే భవిష్యత్‌లో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మధ్య తరగతి స్థాయి ఉపాధ్యాయులకు పి4 కార్యక్రమం అనుసంధానం చేయడం అన్యాయమన్నారు. నిర్బంధం చేస్తే భవిష్యత్‌లో తీవ్రంగా స్పందిస్తామని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులకు బదిలీ చేసే 50 రోజులు పూర్తవుతున్న ఇంకా అప్‌గ్రేడ్ పోస్టుల్లో చేరిన ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. 2023 జూలై నాటికి 12వ పిఆర్‌సి అమలు కావాల్సి ఉన్నా... వేతన సవరణ చేయలేదని అన్నారు. 11వ పిఆర్‌సి బకాయిలు, డిఎలు, ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు రావాల్సిన రాయితీలు అందజేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేసి పాత పింఛన్ విధానం అమలు చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఇచ్చిన జిఒ 57ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించాలన్నారు. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరితం చేయాలన్నారు. హైస్కూల్ ప్లస్‌ల్లో ఉపాధ్యాయుల కొరత సమస్య పరిష్కరించాలన్నా రు. కారుణ్య నియామకాల తక్షణం చేపట్టాలన్నారు. అంతర్ జిల్లాల బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మెడికల్ రియంబర్స్మెంట్ బిల్లులు చెల్లింపు సమస్య పరిష్కరించాలన్నారు. మండల విద్యాశాఖ అధికారుల బదిలీలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు బమ్మిడి శ్రీరామ్మూర్తి, ఎల్.బాబూ రావు, పి.ధనలక్ష్మి, కె.దాలయ్య, తంగి మురళి, మోహన రావు, పప్పల రాజశేఖర్, బత్తుల రవికుమార్, దుప్పల శివరాంప్రసాద్, పైడి కాశీవిశ్వనాథ్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో నాయకుల ధర్నా

ధర్నాలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మాట్లాడుతున్న డిఆర్ఒ వెంకటేశ్వరరావు

రెడ్‌క్రాస్ యూత్ విభాగాలు ఏర్పాటు చేయాలి

డిఆర్ఒ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యాన జూనియర్ రెడ్ క్రాస్, యూత్ రెడ్ క్రాస్ ఏర్పాటు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. కలెక్టరేట్‌లో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు అధ్యక్షతన శనివారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి హైస్కూల్, కళాశాలల్లో జెఆర్‌సి, వైఆర్‌సి విభాగాలు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో సేవాతత్వాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలు యువతలో సమాజ సేవపై చైతన్యాన్ని తీసుకురావాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్యశాఖ అధికారి అనిత, జిల్లా విద్యాశాఖాధికారి, రీజినల్ ఇన్‌స్పెక్టింగ్ ఆఫీసర్, జిల్లా వొకేషనల్ విద్యాధికారి, గవర్నమెంట్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపపాళ్లు, కెజిబివి కాకినాడ ఆదిత్య కాలేజీల ప్రతినిధులు, శివాని ఇంజినీరింగ్ కళాశాల ప్రతినిధులు, న్యూ సెంట్రల్ స్కూల్ డైరెక్టర్, డైట్ ఒమ్మరవిల్లి జెఆర్‌సి విద్యార్థులు, రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు కళ్యాణ్ చక్రవర్తి, అడ్మిన్ ఆఫీసర్ ఎ.నర్సింగరావు, మేనేజర్ గుణాకర్, ప్రోగ్రామ్ మేనేజర్లు గోలివి రమణ, కె.సత్యనారాయణ, పెంకి చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఎల్ కార్మికుల పొర్లుదండాలు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోకి భూములు ఇచ్చిన కార్మికుల పొట్టలు కొట్టొద్దని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి టెక్కలిలో మరో మద్యం డిపో ఏర్పాటుకు ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని, కార్మికుల ఉపాధి కాపాడాలని కోరుతూ హమాలీలు శనివారం పొర్లు దండాలు పెట్టి వినూత్నంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎచ్చెర్లలో దళిత కుటుంబాల నుంచి జాతీయ రహదారి పక్కన కోట్లాది రూపాయలు విలువ చేసే 4 ఎకరాలు భూమిని ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకుండా ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి ప్రభుత్వం తీసుకొని ఎచ్చెర్లలో బాటిలింగ్ యూనిట్ ఏర్పాటు చేసిందని అన్నారు. ప్రభుత్వం భూములిచ్చిన దళిత కుటుంబాలు కార్మికులుగా, హమాలీలుగా అప్పటి నుంచి ఇప్పుడు 80మంది లోడింగ్, అన్ లోడింగ్ పనులు పనిచేస్తూ రోజు వారీ వచ్చే ఆదాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని అన్నారు. ఉమ్మడి జిల్లాలో ఒక డిపో ద్వారా కొనసాగుతున్న దాన్ని విడగొట్టి ఇప్పుడు కొత్తగా టెక్కలిలో మరో డిపో ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని అన్నారు. ఎచ్చెర్లలో ప్రభుత్వ సొంత గొడౌన్ ద్వారా మద్యం సరఫరా చేస్తుంటే... అదనంగా టెక్కలిలో మరో ప్రైవేట్ గొడౌన్ అద్దెకు తీసుకొని ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. దీని వల్ల టెక్కలిలో గొడౌన్‌కు ప్రభుత్వం అద్దె చెల్లించాలని, అదనపు సిబ్బందిని నియమించాలని నెలకు లక్షలాది రూపాయలు ప్రభుత్వంపై అదనపు భారం పడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో హమాలీస్ యూనియన్ నాయకులు టి.రామారావు, ఎం.సురేష్, బోనెల రాము, లింగాల రాము, జి.గురుమూర్తి, పి.రామారావు, ఎల్.సీతారాం, ముద్దాడ రాజు, కె.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

పొర్లుదండాలు పెడుతూ వినూత్న ధర్నా చేస్తున్న కార్మికులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

డిఎంహెచ్ఒ అనిత

ప్రజాశక్తి- కంచిలి

సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిఎంహెచ్ఒ కె.అనిత ఆదేశించారు. మండలంలోని బొగాబెనికి చెందిన 8వ తరగతి విద్యార్థిని గాయత్రి దండియా ఇటీవల మలేరియా వ్యాధి లక్షణాలతో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ మేరకు డిఎంహెచ్ఒ స్థానిక వైద్యాధికారులతో కలిసి శనివారం బాలిక స్వగ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా బాలిక తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలో పారిశుధ్యం, వైద్య సేవలు, ఇతర అంశాలను గురించి స్థానిక అధికారులను అడిగారు. అనంతరం ఎం.ఎస్.పల్లి, కంచిలి పిహెచ్‌సిలను సందర్శించారు. అందిస్తున్న వైద్య సేవలను గురించి పరిశీలించారు. ఈమెతో పాటు ఇన్‌ఛార్జి వైద్యాధికారి వందిత, మలేరియా అధికారి లక్ష్మీనారాయణ, సిబ్బంది విజయ్ కుమార్ ఉన్నారు.

వివరాలు సేకరిస్తున్న డిఎంహెచ్ఒ అనిత

మాట్లాడుతున్న మహాలక్ష్మి

కనీస వేతనం అమలు చేయాలి

ఎండిఎం గౌరవాధ్యక్షులు మహాలక్ష్మి

ప్రజాశక్తి- నరసన్నపేట

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు, ఆయాలకు రూ.20 వేలు వేతనం అమలు చేయాలని, 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి డిమాండ్ చేశారు. నరసన్నపేటలో మండల కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. గౌరవ వేతనాల పేరుతో తీవ్రంగా శ్రమదోపిడి చేస్తున్నాయని అన్నారు. 25 ఏళ్లుగా మధ్యాహ్న భోజన వంట కార్మికులకు, ఏడేళ్లుగా పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు అతితక్కువ గౌరవ వేతనమిస్తూ పని చేయించుకోవడం సరికాదన్నారు.

రాజకీయ తొలగింపు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకు పనిప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, రెండు జతల యూనిఫాం ఇవ్వాలని, ఆరోగ్య బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. ఇఎస్ఐ, పిఎఫ్, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ నెలలో నిర్వహించనున్న రాష్ట్రమహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల కమిటీ సభ్యులు ఎ.రాధ, ఆర్.కాంతమ్మ, నాగమణి, రత్నం, సూరమ్మ, విజయకుమారి, సరస్వతి పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తు వేగవంతం

- మహిళా బాధితులపై మర్యాదగా వ్యవహరించాలి
- ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

పోలీస్‌స్టేషన్‌కు వచ్చే మహిళా బాధితులు, మహిళలపై మర్యాదగా వ్యవహరించి, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి డిఎస్‌పిలు, సిఐ, ఎస్‌లతో క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్ కేసులు నమోదు, దర్యాప్తు, మహిళ ఫిర్యాదులు, నాన్ బెయిలబుల్ వారెంట్స్ అమలు, పెండింగ్‌నకు ఉన్న కారణాలపై శనివారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ మేరకు పలు ముఖ్యమైన అంశాలపై దిశనిర్దేశాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యలతో పోలీస్‌స్టేషన్లకు వచ్చిన మహిళా బాధితుల సమస్యలు, వారి అర్జీలను స్టేషన్ ఎస్హెచ్ఒలు పూరిస్థాయిలో తెలుసుకోవాలన్నారు.

వారి సమస్యలపై చట్ట పరమైన కచ్చితమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోజూ మహిళా పోలీసులతో గ్రామాల్లో సందర్శించి గృహసింహ, ఇతర నేరాలు గురించి తెలుసుకుని అవగాహన కల్పించాలన్నారు. మహిళ భద్రత, సైబర్ నేరాలు, మత్తు పదార్ధాలు వల్ల కలిగే అనర్థాలు తెలియజేయాలన్నారు. గ్రామాల్లో చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలు గురించి సమాచారం సేకరించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. శక్తియాప్, డయల్ 112 గురించి మరింత ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌లా వారిగా పెండింగ్‌లో ఉన్న వారెంట్లపై ఆరా తీశారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి కె.వి.రమణ, సైబర్ సెల్ సిఐ శ్రీనివాస్, డిఎస్ఆర్‌బి ఎస్ఐ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

జూమ్‌లో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

మహిళలను కించపరిచేవారికి పరామర్శలా?

- మరోమారు బయటపడిన జగన్ నిజస్వరూపం
- ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిపై ఎమ్మెల్యే గౌతు శిరీష ఫైర్ అయ్యారు. పలాస ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మహిళలను కించపరిచే విధంగా ప్రసన్నకుమార్‌రెడ్డి మాటలను ఖండించకుండా ఆయనకు వత్తాసు పలుకుతూ పలకరించాడనికి జగన్ వెళ్లడం దారుణమన్నారు. తల్లి, చెల్లికి అన్యాయం చేసిన జగన్ రాష్ట్రాన్ని ఏమి బాగు చేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పరామర్శతో జగన్ నిజస్వరూపం మరోసారి బయటపడిందన్నారు. వైసిపి అధికారంలో ఉన్న ఐదేళ్లలో రాష్ట్రంలో చేసిన అభివృద్ధి ఏముందని ప్రశ్నించారు. ప్రజావేదిక కూలదోతతో మొదలైన అరాచకాలు ఐదేళ్లపాటు కొనసాగించారని అన్నారు. ఇదేమిటని ప్రశ్నించే ప్రతిపక్షనాయకులపై దాడులు చేయించారని, మీడియా సంస్థలను అణచివేసేందుకు కుట్రలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలంతా వైసిపికి 11 సీట్లకే పరిమితం చేసిందన్నారు. అసెంబ్లీకి రాకుండా పాతపాటే పడుతూ అబద్ధాలతో ప్రజల్లోకి వెళ్లడానికి ప్రయత్నిస్తున్న వైసిపి నాయకులను ప్రజలు ఛీకొడుతున్నారని వ్యాఖ్యానించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎపిసి శశిభూషణరావు

కెజిబివిలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి- కవిటి

ప్రభుత్వం కెజిబివిలపై ప్రత్యేక దృష్టిసారిస్తోందని, దానిని దృష్టిలో ఉంచుకుని కెజిబివి సిబ్బంది నిరంతరం విద్యార్థుల ప్రతిభను మెరుగుపరిచేందుకు కృషి చేయాలని సర్వ శిక్షా అభియాన్ ఎపిసి డాక్టర్ ఎస్.శశిభూషణరావు తెలిపారు. మండలంలోని కొత్తపాలెం కెజిబివిని శనివారం సందర్శించిన సిబ్బందికి పలు సలహాలు, సూచనలు అందించారు. విద్యా బోధనతో పాటు మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలని అన్నారు. అదే సమయంలో వర్షాకాలం దృష్ట్యా పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచి విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి ప్రతిభను తెలుసుకున్నారు. అదే సమయంలో పాఠశాల సిబ్బంది పనితీరు హాస్టల్ సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంఇఒ ధనంజయ మజ్జి, సనపల రామకృష్ణ, ప్రిన్సిపాల్ పొల్లాయి లక్ష్మి పాల్గొన్నారు.

ఉద్దానంపై అచ్చెన్న మొసలికన్నీరు

ప్రజాశక్తి-శ్రీకాకుళం ప్రతినిధి

తమకు రాజకీయంగా.మైలేజ్, ఆర్థికంగా ఉపయోగపడే ప్రాజెక్టులు, అభివృద్ధి పనులను తాము ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలకు, ప్రజలకు, రైతులకు కీడు చేసే ప్రాజెక్టులను ఇతర ప్రాంతాలపై రుద్దేందుకు కొందరు ప్రజాప్రతినిధులు ఏ మాత్రం వెనుకాడరు.అందులో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ఆకు ఎక్కువే తిన్నారు. ప్రభుత్వం నుంచి పలు అభివృద్ధి పథకాల కింద వచ్చే నిధులను ఒక్క టెక్కలి నియోజకవర్గంపై కుమ్మరిస్తున్నారు. గత నెల 27వ తేదీన టెక్కలి నియోజకవర్గం సంతబొమ్మాళి ఒక్క మండలంలోనే మూడు కోట్ల రూపాయల విలువ గల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. జిల్లాకు వచ్చిన ప్రతి సారి మంత్రి అచ్చెన్నాయుడు టెక్కలి నియోజకవర్గంలో ఏదో ఒక మండలంలో రోడ్లు, తాగునీటి పథకాలను శంకుస్థాపన చేస్తూనే ఉన్నారు. ఇటీవల జీర్ణోద్ధరణ దేవాలయాలకు ప్రభుత్వం ఇచ్చే రూ.10 వేల సాయం పథకంలోనూ టెక్కలి నియోజకవర్గ పరిధిలోని నాలుగు దేవాలయాలకు ఇవ్వగా, శ్రీకాకుళం నియోజకవర్గానికి ఒక దేవాలయాన్ని మాత్రం ఎంపిక చేసినట్టు మంత్రి కార్యాలయమే పకటించింది. ఇలా తన సొంత నియోజకవర్గానికి మంచి చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు జిల్లాలోని ఇతర నియోజకవర్గాలపై ఏ మాత్రం ప్రేమ కనబరచడం లేదు.పైగా తన నియోజకవర్గానికి ఇబ్బంది కలిగించే ప్రాజెక్టులు, పరిశ్రమలు రాకుండా జాగ్రత్త పడుతున్నారు. ఉద్దానం ప్రాంతంలో ప్రస్తుతం చిచ్చు రేపుతున్న కార్గో ఎయిర్ పోర్టు మందస ప్రాంతానికి రావాల్సింది కాదనే చర్చ సాగుతోంది. ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకం ప్రారంభోత్సవం సందర్భంగా గతేడాది అక్టోబరు 31న ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టెక్కలి,పలాస మధ్య ఎయిర్ పోర్టు వస్తుందని ప్రకటించారు. కానీ అనూహ్యంగా అది పలాస దాటి పోయింది.

సంతబొమ్మాళి మండలం మూలపేట వద్ద 10 వేల ఎకరాల్లో ఇండస్ట్రీయల్ కారిడర్ ఏర్పాటు చేసే ఆలోచన నేపథ్యంలో సరుకు రవాణకు టెక్కలి సమీపంలో ఏర్పాటు చేయడమే అనువుగా ఉంటుందని ఒకానొక దశలో చర్చ నడిచింది. మందస ప్రాంతానికి దానిని తరలించడం వెనుక రకరకాల వ్యూహాలు దాగున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. టెక్కలి ప్రాంతంలో దానిని నిర్మిస్తే ప్రజలు, రైతుల ఆందోళనలు మంత్రి అచ్చెన్నకు తలనొప్పిగా మారే అవకాశాలు ఉన్నాయి.పైగా రాజకీయంగా కొంత నష్టం కలిగించనుంది. ఈ నేపథ్యంలోనే దానిని మందసకు తరలించారన్న టాక్ వినిపిస్తోంది. కార్గో ఎయిర్ పోర్టు కోసం ప్రస్తుతం 1400 ఎకరాలు మాత్రమే సేకరిస్తున్నామని ప్రభుత్వం చెప్తున్నా దానికి ఆనుకుని ఉన్న కొండలు, సిఆర్‌జెడ్ భూములు పెద్ద ఎత్తున భూములు ఉండటంతో వాటిని కూడా రాబోవు రోజుల్లో కార్పొరేట్లకు కట్టబెట్టనుందన్న చర్చ స్థానికంగా జరుగుతోంది.

ప్రభుత్వం, మంత్రి అచ్చెన్నాయుడు ఆలోచనలు ఎలా ఉన్నా కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణంతో మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని రైతులకు తీవ్ర నష్టం చేయనుంది. జీడిమామిడి, కొబ్బరి తదితర పంటలు పండించుకుని బతుకుతున్న రైతులు, ప్రజలు ప్రభుత్వ నిర్ణయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. తమ భూములను రక్షించుకోవడానికి కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేకపోరాట కమిటీగా ఏర్పడి వివిధ రూపాల్లో ఆందోళనలు సాగిస్తున్నారు. బతుకు పోరాటం సాగిస్తున్న వారిపై ఎమ్మెల్యే గౌతు శిరష, మంత్రి అచ్చెన్నాయుడు చేస్తున్న వ్యాఖ్యలు వారిలో మరింత ఆగ్రహాన్ని రగిలిస్తున్నాయి. ఎవరు అడ్డుకున్నా ఎయిర్ పోర్టు కట్టి తీరుతామంటూ ప్రజలను రెచ్చగొట్టేలా సభలు, సమావేశాల్లో ఎమ్మెల్యే శిరీష మాట్లాడటం స్థానికులు నొచ్చుకుంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు టెక్కలికి ఎయిర్‌పోర్టు ఇస్తానంటే వెనుకబడిన ఉద్దానానికి అది అవసరమని తానే చెప్పానని మంత్రి అచ్చెన్నాయుడు చేసిన ప్రకటనలు ఆ ప్రాంతంపై ఆయనకున్న ప్రేమ మొసలి కన్నీరుగా అభివర్ణిస్తున్నారు. టెక్కలి ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సిన కార్గో ఎయిర్‌పోర్టును తమపై రుద్దుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉద్దానం ప్రాంతంలో పచ్చని పంట పొలాల్లో కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో చిచ్చు రేపాలని చూస్తున్నారంటూ మండిపడుతున్నారు. తమ గ్రామాలకు సరియైన రోడ్లు లేవని, గతుకుల రోడ్లపైనే ప్రయాణిస్తూ ఇబ్బందులు పడుతుంటే ఒక్క రోడ్డు మంజూరు చేయని మంత్రి అచ్చెన్నాయుడు ఏకంగా ఎయిర్‌పోర్టు తీసుకువస్తానని చెప్పడాన్ని వారు ఏ మాత్రం విశ్వసించడం లేదు.

ఉద్దాన ప్రాంత రైతులు ప్రధానంగా పండిస్తున్న జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వ పరంగా కొనుగోలు చేయడానికి వ్యవసాయ మంత్రిగా ఏ మాత్రం చొరవ చూపని అచ్చెన్నాయుడు ఉద్దాన ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం, బతుకులు బాగు చేస్తామంటే ఎవరు నమ్ముతారని ప్రభావిత గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎయిర్‌పోర్టుతో అభివృద్ధి జరిగిపోతుంది, ఉద్యోగాలు వస్తాయంటూ భూముల కోసం పాలకులు పదే పదే వినియోగించే అస్త్రం కూడా ప్రస్తుతం ఇక్కడ పని చేసే పరిస్థితి కనిపించడం లేదు. మంత్రి అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గం సంతబొమ్మాళి మండలం కాకరాపల్లిలో ఏర్పాటు చేసిన మర్చంట్ థర్మల్ పవర్ ప్లాంట్ కోసం 2 వేల ఎకరాలకు పైగా భూములు తీసుకున్నప్పుడు అప్పటి పాలకులు మాట చెప్పారని,ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయే తమకు తెలుసుని ప్రభావిత గ్రామాల ప్రజలు గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం అది దివాళ తీయడంతో కారు చౌకగా ఓ కంపెనీ ప్రభుత్వం కట్టబెట్టడం అందరికీ తెలిసిందేనని అంటున్నారు. కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం మొండిగా వెళుతుందా లేక ప్రజా వ్యతిరేకతకు తలొగ్గి ఆ ప్రతిపాదనను ఉపసంహరించుకుంటుందా అనేది వేచి చూడాల్సి ఉంది.

ఖాథీ వస్త్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ దంపతులు

ఖాదీ వస్త్రాల ప్రాధాన్యతను గుర్తించాలి

ప్రజాశక్తి- పొందూరు

ఖాదీ వస్త్రాల ప్రాధాన్యతను, విశిష్టతను యువత గుర్తించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మండల కేంద్రంలోని ఆంధ్రాఫైన్ ఖాదీ కార్మికాభివృద్ధి సంఘం, సాయిబాబా వీవర్స్ సొసైటీలను శనివారం కలెక్టర్ ఆయన సతీమణితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను ఆకట్టుకునేలా ఆధునిక పద్ధతుల్లో, పలురకాల డిజైన్‌లలో ఖాదీ వస్త్రాల రూపకల్పన చేపట్టాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పొందూరు ఖాదీకి ఎంతో విశిష్టమైన గుర్తింపు ఉందన్నారు. ఖాదీ వస్త్రాలు తయారీలో భాగంగా పత్తి నుంచి ధారం తయారయ్యే వివిధ ప్రక్రియలను సిబ్బంది కలెక్టర్‌కు వివరించారు. ఖాదీ వస్త్రాల తయారీలో కార్మికుల నైపుణ్యం కొనియాడదగినదని పేర్కొన్నారు. పొందూరు ఖాదీ అభివృద్ధికి తనవంతు కృషిని అందిస్తానని సిబ్బందికి తెలిపారు. అనంతరం పలు ఖాదీవస్త్రాలు, చీరలను ఆయన కొనుగోలు చేశారు. ఈయనతో పాటు ఎఎఫ్‌కెకె సంఘం అధ్యక్షులు జి.కామేశ్వరప్రసాద్, సెక్రటరీ దండా వెంకటరమణ, సాయిబాబా వీవర్స్ సొసైటీ మేనేజర్ వట్టం శ్రీనివాసరావు, పిఎసిఎస్ సిఇఒ ఎర్నేన పాపినాయుడు, మాజీ ఎంపిటిసి కోరుకొండ సాయికుమార్ తదితరులున్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస పురుషోత్తపురంలో రూ.5 లక్షల వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని అన్నారు. అందులో భాగంగా తాగునీరు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. రైల్వే వంతెన పూర్తి చేసి పట్టణ ప్రజలకు కానుకగా ఇస్తామన్నారు. మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, ఎం.నరేంద్ర చిన్ని, మల్లా శ్రీనివాసరావు టంకాల రవిశంకర్ గుప్తా, బి.నాగరాజు పాల్గొన్నారు.

'జగన్ తీరు మారలేదు'

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గ్రీష్మ

వైసిపి నాయకులు చేసిన తప్పులను వైసిపి అధ్యక్షులు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రశ్నించరా అని మ్మెల్సీ కావలి గ్రీష్మ అన్నారు. నగరంలోని టిడిపి కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. టిడిపి ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై వ్యక్తిత్వ హననానికి పాల్పడే విధంగా మాట్లాడిన మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డిని మందలించాల్సి పోయింది పరామర్శిస్తారా? అని ప్రశ్నించారు. ప్రసన్న కుమార్‌రెడ్డి ఏం సాధించారని పరామర్శకు వెళ్లారని ప్రశ్నించారు. నెల్లూరులో జగన్మోహన్‌రెడ్డి పర్యటనకు జనాలు లేకపోతే సొంత మీడియా తప్పుడు వీడియోలు ప్రదర్శించిందని అన్నారు. వైసిపి పాలనలో రాష్ట్రాన్ని కొల్లగొట్టిన బ్యాచ్ ఒక్కొక్కరిగా జైలుకు వెళు్తన్నారని, దీంతో జగన్ దంపతులకు భయం పట్టుకుందని అన్నారు. అందుకే గవర్నర్‌ను కలిశారని పేర్కొన్నారు. ఆరోగ్యంగా ఉన్న గవర్నర్‌ను ఇప్పుడు కలవాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. మద్యం కేసులో కోట్లు దోచుకున్న వారు జైలుకు వెళ్లడం ఖాయమని అన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మాట్లాడుతున్న తిలక్

టెక్కలి నియోజకవర్గంలో అధికారులతో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తప్పుడు పనులు చేయిస్తున్నారని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ ఆరోపించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 40 ఏళ్ల జిల్లాలో అధికారంలో ఉన్న మీరు ఏం చేశారో చెప్పగలరా? అని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు ఎలా ఇచ్చామో బహిరంగంగా చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు. నవ రత్నాలు పథకాలు ఎలా ఇచ్చామో వివరిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన 143 హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు.

స్టాల్‌ను ప్రారంభిస్తున్న పీడీ కిరణ్ కుమార్

రైల్వేస్టేషన్‌లో స్టాల్ ప్రారంభం

ప్రజాశక్తి- ఆమదాలవలస

శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్‌లో రైల్వేశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న వన్ స్టేషన్ వన్ ప్రోడక్ట్ కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘ ఉత్పత్తుల విక్రయ స్టాల్‌ను సెర్ఫ్, గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ కిరణ్ కుమార్, స్టేషన్‌మాస్టర్ ఎస్.ఉమామహేశ్వరరావులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ స్టాల్‌ను తాళ్లవలస గ్రామానికి చెందిన భరతమాత స్వయం సహాయక సంఘ సభ్యులు గండ్రెడ్డి కామేశ్వరి నిర్వహిస్తారని తెలిపారు. ఈస్టాల్ ద్వారా గ్రామీణ మహిళల అభివృద్ధికి తోడ్పాటును అందించడమే కాకుండా స్థానికంగా తయారైన ఉత్పత్తులకు గిరాకీ పెరగడానికి ఇదొక గొప్ప వేదిక అవుతుందన్నారు. కార్యక్రమంలో డిపిఎం బి.నారాయణరావు, ఎపిఎం జి.నారాయణ రావు, మండల సమాఖ్య అధ్యక్షులు టి.ధనలక్ష్మి, సిసిలు, విఒఎలు, అకౌంటెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన

సోంపేట: రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణపై బారువా ఎస్ఐ తిరుపతి నాయుడు వాహనదారులకు, ప్రజలకు శనివారం రాత్రి అవగాహన కల్పించారు. ఈ మేరకు కొర్లాం జాతీయ రహదారి వద్ద అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన రక్షణ చర్యలు గురించి తెలియజేశారు. వాహనాలు నడిపేటప్పుడు వాహనాలకు సంబంధించిన పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు తోడ్పాటు

ప్రజాశక్తి- కంచిలి

రైతులకు అన్ని విధాల తోడ్పాటు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. స్థానిక మార్కెట్ కమిటీ యార్డు ఆవరణలో శనివారం అన్నదాత సుఖీభవ-పిఎం కిషాన్ కార్యక్రమాన్ని శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నమన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి శశిభూషణ్, వ్యవసాయ శాఖ ఎడిఎ భవాని శంకర్, ఉద్యానవనశాఖ అధికారిని మాధవీలత పాల్గొన్నారు.

నరసన్నపేట : అన్నదాత సుఖీభవం-పిఎం కిషాన్ చెక్కును ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అందజేశారు. కార్యక్రమంలో నరసన్నపేట నియోజకవర్గం సమన్వయకర్త బగ్గు అర్చన, కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణం నాయుడు, ఎం.వెంకట అప్పలనాయుడు, శిమ్మ చంద్రశేఖర్, భైరి భాస్కర రావు, తహశీల్దార్లు శ్రీనివాసరావు, సత్యనారాయణ, ఎడిఎ వెంకట మధు, ఎఒ చిరంజీవి, సూర్యకుమారి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఎం.రామారావు

కంచిలి : మాట్లాడుతున్న విప్ అశోక్

ఆధ్వర్యాన అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌టిసి వెంకటేష్, టిడిపి నాయకులు వజ్జా బాబూరావు, పి.విఠల్‌రావు, మాజీ ఎంపిపి సురాడ మోహనరావు, గోరకల వసంతరావు, పుచ్చ ఈశ్వరరావు, ఎంపిడిఒ రమేష్ నాయుడు, ఎఒ ధనుంజయ, తహశీల్దార్ సీతారామయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు వంకాల కూర్మారావు పాల్గొన్నారు.

ఆమదాలవలస: రైతన్నల కళ్ళలో ఆనందం చూడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ అన్నారు. పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, నారాయణపురం ప్రాజెక్ట్ చైర్మన్ సనపల ఢిల్లేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షుడు నూకరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత, జిల్లా టిడిపి కార్యాలయ కార్యదర్శి మొదలవలస రమేష్, ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె. భాగ్యలక్ష్మి, మండల ఎఒ మెట్ట మోహనరావు, టిడిపి నాయకులు అన్నెపు భాస్కరరావు, నాగళ్ల మురళీధర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: మండలం కళ్లేపల్లి గ్రామంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని నియోజకవర్గ టిడిపి మహిళా అధ్యక్షులు గొండు స్వాతి ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, అరవల రవీంద్ర, జి.భాస్కరరావు, వ్యవసాయ అధికారి డి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: టిడిపి ప్రారంభం నుంచి ఎన్‌టిపి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి ఆంధ్రాను అభివృద్ధి పథంలో తీసుకువచ్చారని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవరావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ అవరణలో అన్నదాత సుఖీభవ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి బోయిన గోవిందరాజులు, టెక్కలి ఆర్‌డిఒ ఎన్.కృష్ణమూర్తి, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, టెక్కలి ఎడిఎ జగన్మోహన్‌రావు, ఎంపిడిఒ ఫణీంద్రకుమార్, తహసీల్దార్ అప్పలరాజు, ఎఒ గోవిందరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నిధి అగర్వాల్

నిధి అగర్వాల్ సందడి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నగరంలోని జి.టి రోడ్డులో సౌత్ ఇండియా షాపింగ్‌మాల్‌ను శనివారం ప్రముఖ సినీనటి నిధి అగర్వాల్ ప్రారంభించారు. దీంతో షాపింగ్‌మాల్ ఆవరణలో సందిడి నెలకొంది. ప్రజలు సినీనటిని చూసేందుకు ఎగబడ్డారు. శుభకార్యాలకు, వ్యక్తిగత అవసరాలకు అవసరమైన అన్ని రకాల దుస్తులు లభ్యం అవుతాయని సినీనటి అన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా షాపింగ్ మాల్లో ప్రత్యేక ఆఫర్లు కొనసాగాయి.

నేరుగా గురుకుల ప్రవేశాలు

నందిగాం : స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాల కళాశాలలో ఐదు నుంచి 9వ తరగతి వరకు, అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి ఖాళీగా ఉన్న సీట్లు ఎస్‌సి కేటగిరీలో అర్హత కలిగి సీటు కావాల్సిన వారు నేరుగా పని వేళలో పాఠశాలలో హాజరు కావాలని ప్రిన్సిపాల్ బి.మంజుల ఒక ప్రకటనలో కోరారు.

వెంకన్నచౌదరిపై విమర్శలు తగవు

పలాస: నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష భర్త, నియోజకవర్గం సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరిపై వైసిపి నాయకులు తమ మీడియా ద్వారా విమర్శలు చేయడాన్ని తగదని టిడిపి నాయకులు తప్పుబట్టారు. స్థానిక టిడిపి కార్యాలయంలో జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, పిసిఎంఎ ప్రధాన కార్యదర్శి టంకాల రవిశంకర్ గుప్తా, సీనియర్ కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ శనివారం మాట్లాడారు. 2014-19లో టిడిపి పాలనలో చేసిన విమర్శలే మళ్లీ వైసిపి నాయకులు చేస్తున్నారని అన్నారు. వారు చేసిన దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మలేకే 2024 ఎన్నికల్లో ఘోరంగా ఓడించారన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఎమ్మెల్యే శిరీష గెలుపొందిన ఏడాదిలోనే పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల్లో మూడు ప్రధానమైన ఆక్రమణలు తొలగించారని, రూ.550 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని అన్నారు. సమావేశంలో జోగ మల్లి, కె.సురేష్ చాణక్య, శివాజి పాల్గొన్నారు.

పుష్పగుచ్ఛం అందిస్తున్న రాజేష్

రాజేష్ అభినందనలు

కవిటి: ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి డైరెక్టర్‌గా నియమితులైన సందీప్ పంచకర్లకు కళింగ కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి లోల్ల రాజేష్ అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు విశాఖపట్నంలోని సందీప్ నివాసంలో శనివారం కలిసి ఆయనకు సత్కరించారు. ఈ సందర్భంగా నియోజక వర్గంతో పాటు జిల్లాలో జనసేన బలోపేతంపై చర్చించారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యం

శ్రీకాకుళం సిటీ: జిల్లా ఎస్‌పి కె.వి. మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యాసంస్థల్లో మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు, బాలికలపై జరిగే నేరాలు, చట్టాలు, శిక్షలు, సిసి కెమెరాలు ఏర్పాటుపై ప్రజలకు విస్తృతంగా జిల్లా పోలీసులు అవగాహన కల్పించారు. నారీశక్తి, సంకల్పం ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. శక్తియాప్ అవశ్యకత, ఉపయోగం, ప్రయోజనం, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఆపద సమయంలో డయల్ 112, శక్తి యాప్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, ఉమెన్ హెల్ప్ లైన్ 181, సైబర్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 నంబర్లపై అవగాహన కల్పించారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలు దుష్ప్రభావాలపై వివరించారు.

గిరిజన సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- కొత్తూరు

జిల్లాలో ఆదివాసీ గిరిజనుల ప్రధాన సమస్యలు పరిష్కరించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. శుక్రవారం నుంచి 9వ వరకు నిర్వహించనున్న ఆదివాసీ దినోత్సవ వారోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందని చెప్పడం మినహా చేతల్లో అమలు కావడం లేదన్నారు. కొన్నేళ్లుగా గిరిజన గ్రామాల్లో ఆదివాసీల సమస్యలు పరిష్కారం చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కారణంగా జిల్లాలో ఇప్పటికే చాలా గ్రామాల్లో రోడ్లు, శ్మశానానికి రోడ్లు, తాగునీటి సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారని అన్నారు. జిల్లాలో ఐటిడిఎ లేకపోవడంతో గిరిజనుల సమస్యలు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అప్పన్న

పరిష్కారం కావడం లేదన్నారు. గిరిజన భూములకు రక్షణ, సాగు హక్కుదారులకు పట్టాలు, చదువుకున్న నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధ్యాయ అవకాశాలు, వైద్య సదుపాయాలు, నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్లో మార్చే ప్రయత్నాలను వెంటనే చేయాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజనులు సవర రవి, సవర రవినాథ్, సవర అబ్రహం, సవర రంగారావు ఆరిక గణపతిలు పాల్గొన్నారు.

హామీల అమల్లో విఫలం

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మాట్లాడుతున్న అప్పలరాజు

కూటమి ప్రభుత్వం హామీలు అమలులో పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, వైసిపి రాష్ట్ర డాక్టర్ విభాగం అధ్యక్షులు సీదిరి అప్పలరాజు విమర్శించారు. నగరంలోని వైసిపి కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. సూపర్ సిక్స్ అంటూ ప్రచారం చేసిన అప్పటి వీడియోలను ప్రదర్శించారు. డ్రామాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. నులక మంచంపై కూర్చోవడం, ఆటోలు ఎక్కడం లాంటి డ్రామాలు చంద్రబాబుకే చెల్లాయని అన్నారు. మాజీ ముఖ్య మంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన రైతు భరోసాను కెసిఆర్, మోడీ అనుకరించారని అన్నారు. ఇప్పుడు అన్ని రాష్ట్రాలూ జగన్నే అనుచరిస్తున్నాయని చెప్పారు. చంద్రబాబు 2024లో అన్నదాత సుఖీభవ ఎగ్గొట్టారని విమర్శించారు. ఐదేళ్లలో రెండేళ్లు ఈ పథకం ఎగ్గొట్టే కుట్ర చేస్తున్నారని అన్నారు. 2024లో తల్లికి వందనం కూడా ఇవ్వలేదని అన్నారు. సున్నావడ్డీ రుణాలు రైతులకు ఇవ్వడం లేదన్నారు.

రేపు ఫోన్లు అప్పగింత

ప్రజాశక్తి- ఆమదాలవలస

అంగన్వాడీ కేంద్రాల నిర్వహణకు ఇచ్చిన ఫోన్లను ఈ నెల 4న సిడిపిఒ కార్యాలయంలో అందజేస్తామని అంగన్వాడీలు శనివారం డేటాఎంట్రీ ఆపరేటర్ అమర్‌కు నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు మాట్లాడుతూ ఆగస్టు 5 నుంచి ఆన్‌లైన్ పర్యవేక్షణ చేయలేమని, అంగన్వాడీ సెంటర్లలో హాజరు, లబ్ధిదారులు ఆహారం, సరుకులు పంపిణీ మొత్తం రికార్డుల్లో నమోదు చేస్తామని తెలిపారు. ఎఫ్‌ఆర్ఎస్ రద్దు చేయాలని, కొత్తగా మాతృ వందనం పథకం అమలు చేయలేమని తెలిపారు. అంగన్వాడీ సెంటర్ నిర్వహణకు ఇచ్చిన ఫోన్లు పోషణ ట్రాకర్ బాల సంజీవిని యాప్‌లకు సపోర్టు చేయడం లేదని లబ్ధిదారులకు ఫోటో క్యాప్చర్ ఒటిపి, ఎఫ్‌ఆర్ఎస్ ద్వారానే సరుకులు ఇవ్వాలని పెట్టిన నిబంధన అమలు చేయటానికి అంగన్వాడీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సరుకులన్నీ ఒక్కసారిగా రావడం లేదని, నెట్‌సిగ్నల్ లేకపోవడం, సక్రమంగా ఫోన్లు పని చేయకపోవడం వలన

పలాస : వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

ఆమదాలవలస : నోటీసును అందజేస్తున్న అంగన్వాడీలు

లబ్ధిదారులందరూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అన్ని యాప్‌లు కలిపి ఒక యాప్‌గా మార్పు చేయాలని, ఎఫ్‌ఆర్ఎస్ ఇన్ అవుట్ రద్దు చేయాలని, అంగన్వాడీ సెంటర్ నిర్వహణకు ట్యాబ్‌లు, 5జి నెట్ ఇవ్వాలని కోరారు. ఆగస్టు 4న సిడిపిఒ కార్యాలయంలో ఫోన్లు అప్పజెప్పి ఆగస్టు 5 నుంచి ఆన్‌లైన్ వరకు చేయలేనని తెలియజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ జిల్లా యూనియన్ నాయకులు పంచాది లతాదేవి, సెక్టార్ అధ్యక్షులు పి.భూలక్ష్మి, అంగన్వాడీలు లక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

పలాస: అంగన్వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్లు తిరిగి ఐసిడిఎస్ కార్యాలయానికి ఇచ్చేస్తామని అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకులు డి.సునీత, పి.పద్మావతి, ఆర్.అరుణ, రాజేశ్వరి అన్నారు. కాశీబుగ్గ ఐసిడిఎస్ కార్యక్రమంలో శనివారం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆన్‌లైన్ పనిచేయాలంటే 5జి నెట్ వర్క్ కలిగి ఉన్న ట్యాబ్‌లు, సెల్ ఫోన్లు ఇవ్వాలన్నారు. ఇంతవరకు ఆఫ్ లైన్‌లోనే పనిచేస్తామని తెలిపారు.

డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొడదాం

సినీనటి నిధి అగర్వాల్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, సేనో టూ డ్రగ్స్ అని ప్రముఖ సినీనటి నిధి ఆగర్వాల్ పిలుపునిచ్చారు. సినీనటి నిధి అగర్వాల్ శ్రీకాకుళంలో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన సందర్భంగా జిల్లా ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో మత్తు పదార్థాలు నివారణ, నియంత్రణ, అవగాహన చర్యల్లో భాగంగా జి.టి. రోడ్డులో జిల్లా పోలీసు శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణ డిఎస్‌పి సిహెచ్ వివేకానంద ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు డ్రగ్స్ వద్దు బ్రో, సంకల్పం, శక్తీ యాప్, నారీ శక్తీ అనే పోస్టర్లును ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగానికి యువత

పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న సినీనటి నిధి అగర్వాల్

దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. యువత మత్తు పదార్థాల బారిన పడి విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. మత్తుకు బానిసైతే జీవితం నాశనమతుందని గుర్తించాలన్నారు. సామాజిక బాధ్యతతో అంతర్గత భద్రత, ప్రజా రక్షణ కొరకు రాత్రి, పగలు విధులు నిర్వర్తిస్తున్న పోలీసులకు పూర్తి సహాయ సహకారాలు అందించి, సమాజంలో డ్రగ్స్‌ను తరిమికొట్టాలన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

సరుబుజ్జిలి : తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న సూపర్‌వైజర్ అమ్మనమ్మ

ప్రజాశక్తి- నరసన్నపేట

పుట్టిన బిడ్డకు తల్లిపాలు శ్రేయస్కరంగా ఉంటుందని వర్షిని నర్సింగ్ కాలేజీ డైరెక్టర్ పి.మోహనరావు సూచించారు. తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా శనివారం నర్సింగ్ కాలేజీ విద్యార్థులతో తల్లిపాలు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్యుర్థులతో తలి, బిడ్డ ఆరోగ్యం సూచిస్తూ రంగులచే ముగ్గులు వేయంచి దానిపై వివరించారు. దీంట్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా న్యూట్రీషన్ అధ్యాపకులు ఈశ్వరరావు మహిళలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. మహిళలు తమ పిల్లలకు పాలు పెట్టుకుంటా నిర్లక్ష్యం వహించడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నరసన్నపేట : అవగాహన కల్పిస్తున్న మోహనరావు

పలాస : పుట్టిన బిడ్డకు తల్లి పాలు ఔషధమని అంగన్వాడీ కార్యకర్తలు సునీత, సీతాలక్ష్మి, సరస్వతి, ధనలక్ష్మి అన్నారు. మండలంలోని కేదారిపురం అంగన్వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాలు వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్త లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: తల్లిపాలు శిశువు ఆరోగ్యానికి అత్యంత

పలాస : అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీ కార్యకర్త

అమూల్యమైనవని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కె.అమ్మనమ్మ తెలిపారు. శనివారం నందికొండ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్త కళావతి పలు పౌష్టికాహార పదార్థాలను తయారు చేసి ప్రదర్శన చేశారు. ఆ పదార్థాల ద్వారా లభించే విటమిన్లు, పోషకాలను వివరించారు. పౌష్టికాహారంతో పాటు తల్లిపాలను ప్రారంభ రోజుల్లోనే శిశువుకు ఇవ్వడం వల్ల వచ్చే లాభాలు, శరీర రోగనిరోధక శక్తి పెరగడం వంటి అంశాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం శైలజ, ఆశాకార్యకర్త జి.పార్వతి, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

హేమచంద్ మృతదేహం

విద్యార్థి బలవన్మరణం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని ధన్నానపేట వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి దేవల్ల హేమచంద్ (16) రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. విజయనగరం జిల్లా సంతకవిటి మండలం మందరాడ గ్రామానికి చెందిన దేవల్ల హేమచంద్ మండలంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో చదువుతూ పట్టణంలోని మున్సిపల్ ఆఫీసు దగ్గరలో ఉన్న బిసి హాస్టల్‌లో ఉండి విద్యను అభ్యసిస్తున్నాడు. గడచిన కొద్ది రోజులుగా చదువుపై, వసతిగృహంలో ఉండడానికి ఆసక్తి లేకపోవడంతో మూడురోజుల క్రితం తన స్వగ్రామమైన మందరాడకు హేమచంద్ వెళ్లాడు. తల్లిదండ్రులు కుమారుడికి నచ్చజెప్పి మళ్లీ బిసి హాస్టల్‌కు పంపించారు. శుక్రవారం రాత్రి విద్యార్థి తల్లిదండ్రులకు మళ్లీ ఫోన్ చేసి నాకు ఇక్కడ ఉండడానికి ఆసక్తి లేదని చెప్పడంతో శనివారం ఉదయం వచ్చి తీసుకువెళ్తామని చెప్పినప్పటికీ హేమచంద్ శనివారం వేకువజామున 3.30 గంటల సమయంలో శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్ వద్ద విజయనగరం నుంచి భువనేశ్వర్ వైపు వెళ్తున్న హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి హేమచంద్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గాయాలపాలై అపస్మారక స్థితిలో ఉన్న హేమచంద్‌ను ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి పోలీసులు హుటాహుటిన 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం హేమచంద్ మృతి చెందాడు. ఈ సంఘటన తెలియగానే హేమచంద్ తల్లిదండ్రులు, బంధువులు రిమ్స్ ఆస్పత్రికి చేరుకుని శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈశ్వరరావు మృతదేహం

ఐటిబిపి హవల్దార్ ఆత్మహత్య

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి పద్మనాభపురం శివాజీ నగర్ కాలనీకి చెందిన ఐటిబిపి హవల్దార్ బద్రి ఈశ్వరరావు (36) శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జమ్మూ కాశ్మీర్ లో విధులు నిర్వహిస్తూ అనారోగ్య రీత్యా జూన్ 11న సెలవుపై స్వగ్రామానికి వచ్చారు. గత కొంతకాలంగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నాడు. దీనికై చికిత్స పొందుతున్నా కడుపునొప్పి తగ్గకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. భార్య సరస్వతి తన అన్న వదినలతో కలిసి కూలి పనులకు వెళ్లింది. పిల్లలు స్కూల్ వెళ్లడంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన భార్య ఫ్యాన్ కొంక్యానికి వేలాడుతున్న భర్తను బోరున విలపించింది. స్థానికుల సాయంతో కిందకు దించి చూడగా, అప్పటికే మృతి చెందారు. సమాచారం అందుకున్న కాశీబుగ్గ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు చిన్నారులు ఉన్నారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

పిఎసిఎస్ సిఇఒ మృతి

కవిటి: పిఎసిఎస్ సిఇఒ వంజరాన జానకిరామయ్య (56) శనివారం మధ్యాహ్నం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న జానకిరామయ్య విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు.

జానకిరామయ్య (ఫైల్)

జానకిరామయ్యకు భార్య హిమావతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న పిఎసిఎస్ అధ్యక్షుడు ఎర్ర బాసుదేవ్ ప్రదాన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సిఇఒ మృతిపై తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నేడు మెళియాపుట్టి మండల సమావేశం

మెళియాపుట్టి : ఈ నెల 3న మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు రానా ఈశ్వరమ్మ అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ కార్యాలయం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. విధిగా ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, పూర్తి సమాచారంతో అధికారులు హాజరుకావాలన్నారు.

యువతకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావును ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు విజ్ఞప్తి చేశారు. శనివారం ఎమ్మెల్యే ఎన్ఇఆర్ ఇంటిని వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే మంత్రిని గౌరవపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో స్కిల్ డవలప్ మెంట్ సెంటర్ ఏర్పాటు ఆవశ్యకతను మంత్రికి వివరిస్తూ వినతిపత్రం అందించారు. నియోజక వర్గంలో విద్యావంతులైన పురుషులు, మహిళలు అనేక మంది నిరుద్యోగులుగా ఉన్నారని, ఈ సమస్యను తీవ్రమైన అంశంగా పరిగణించి యువత భవిష్యత్‌కు మద్దతు అందించాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో బంటుపల్లి సర్పంచ్ ఎన్.రజని, ఎన్ఇఆర్ స్కూల్ డైరెక్టర్ ఎన్.తేజబాబు, చౌదరి బాబ్జి, డిజిఎం ఆనందరావు, ముప్పిడి సురేష్, పిన్నింటి బానోజీనాయుడు, పిషిని హరికృష్ణ, రౌతు శ్రీను, పిషిని అప్పలనాయుడు, పైడి అప్పడుదొర, పిషిని అసిరినాయుడు, జీరు రామారావు, కుమరాపు రవికుమార్, లంక నారాయణరావు, శ్రీను పాల్గొన్నారు.

మంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఇఆర్

బిఎస్ఎన్ఎల్ 4జి సేవల విస్తరణకు కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

వినియోగదారులకు మరింత లాభదాయకమైన సేవలు అందించేందుకు ప్రభుత్వ టెలికాం సంస్థ బిఎస్ఎన్ఎల్ ముందుకొచ్చింది. సంస్థ తరపున శ్రీకాకుళం టెలికం జిల్లా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ నాయుడు మర్రి ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం రూ.1తో 30 రోజుల పాటు ప్రతిరోజూ 2 జిబి డేటా ఉచితంగా పొందేందుకు అవకాశమిచ్చే 'ఆజాదీ కా అమృత్ ఆఫర్'ను ప్రారంభించినట్లు వెల్లడించారు. ఈ ప్లాన్‌ను మె బిఎస్ఎన్ఎల్ యాప్ లేదా బిఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్ల ద్వారా రీచార్జ్ చేసుకోవచ్చని తెలిపారు. 4జి సేవల విస్తరణకు బిఎస్ఎన్ఎల్ కృషి చేస్తుందని, త్వరలోనే మరిన్ని ప్రాంతాల్లో వేగవంతమైన ఇంటర్నెట్ అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రస్తుత డేటా ధరలతో పోలిస్తే ఈ ప్లాన్ వినియోగదారులకు గణనీయంగా లాభదాయకమని, బిఎస్ఎన్ఎల్ సేవలపై ప్రజల విశ్వాసం మరింత పెరిగేలా ఈ ఆఫర్ ఉపయోగపడుతుందన్నారు. డిజిటల్ ఇండియాలో బిఎస్ఎన్ఎల్ ముఖ్య భాగస్వామిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

రాఘవ చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న అధికారులు

బళ్లారి రాఘవకు నివాళి

ప్రశాశక్తి- శ్రీకాకుళం సిటీ

అనతి కాలంలోనే రాఘవ న్యాయవాదిగా, ముఖ్యంగా క్రిమినల్ కేసులు వాదించడంలో, ప్రసిద్ధి చెందినట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు వెల్లడించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో తాడిపత్రి రాఘవాచార్యులు (బళ్లారి రాఘవ) జయంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయన ప్రతిభను గుర్తించి అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం ఆయనను పబ్లిక్ ప్రాసిక్యూటర్ నియమించిందన్నారు. 'రావు బహద్దూర్ అన్న బిరుదు కూడా ఇచ్చిందని వివరించారు. ఆయనకు నాటకాల్లో ప్రత్యేకాభిమానం, ప్రతిభ ఉన్నట్లు పేర్కొన్నారు. బళ్లారి రాఘవ నాటక ప్రదర్శనను చూడడం ఒక అద్భుతమైన అనుభూతి అని అప్పట్లో కళాప్రియులు చెప్పుకోనేవారన్నారు. తన సమయాన్ని, సంపదను నాటక రంగ పురోగతి కోసం దారాళంగా వెచ్చించినట్లు చెప్పారు. 1946, ఏప్రిల్ 16న రాఘవ మరణించారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, కలెక్టరేట్ పరిపాలనాధికారి సూర్యనారాయణ, పర్యాటక శాఖ అధికారి నారాయణరావు, సెట్‌శ్రీ ఇన్‌చార్జ్ సిఇఒ, కలెక్టర్ కార్యాలయ అన్ని విభాగాల పర్యవేక్షులు, డిటిలు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

పుస్తకావిష్కరణ

టెక్కలి రూరల్ : టెక్కలి ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగపు బోధకులు వి.దివ్యశ్రీ 'మున్సిపల్ సోలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్' పుస్తకాన్ని రచించారు. ఈ మేరకు కళాశాలలో డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు దీనిని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత పర్యావరణ పరిరక్షణకు చెత్తసేకరణతో, కాలుష్య నిర్మూలనకు చేసిన పలు పరిశోధనల అధ్యాయనానికి బోధకులు ఇటువంటి పుస్తకాల ద్వారా అవగాహనా కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఆర్అండ్‌డి డిన్ డాక్టర్ డి.శ్రీరాములు, సివిల్ విభాగాధిపతి డాక్టర్ పి.దినఖర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఇఒలు

ఓపెన్ స్కూల్ విద్యను వినియోగించుకోవాలి

పలాస: ఓపెన్ స్కూల్ విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒలు సిహెచ్.శ్రీనివాసరావు, చెరుకుపల్లి సత్యం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సార్వత్రిక విద్యా పీఠంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఎంతోమంది విద్యార్థులు వివిధ సమస్యలతో చదువు మధ్యలో ఆపేసిన విద్యార్థులకు సార్వత్రిక విద్యాపీఠం ఒక వరమని అన్నారు. మధ్యలో నిలిపివేసిన ద్యార్థులను గుర్తించి సార్వత్రిక విద్యా పీఠం ద్వారా విద్యను అందిస్తామన్నారు. గతంలో పదో తరగతి చదివి ఉత్తీర్ణత కాకపోయినా, ఇంటర్మీడియట్ చదువుకొనే విద్యార్థులు సార్వత్రిక విద్యా పీఠం (దూర విద్య) ద్వారా పూర్తి చేసుకోవచ్చు అన్నారు. మధ్యలో చదువు ఆపేసిన విద్యార్థులు, ఆర్థిక స్తోమత లేక చదువు కోవాలనే ఆలోచన ఉన్నవారిని గుర్తించాలని సచివాలయం ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం జాంబవతి, మండల ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ పోతనపల్లి బాలరాజు, అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయం వెల్ఫేర్లు, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

లైన్ షోయింగ్ విధానంపై అవగాహన

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా మండలంలో చేపేనపేటలో రైతులతో వరుస క్రమంలో నాట్లను వేయించే కార్యక్రమాన్ని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చేపట్టారు. డిపిఎం పూజారి సత్యనారాయణ ఆదేశాల మేరకు మండలంలో ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు ప్రకృతి వ్యవసాయ పిడిఎఫ్ సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైన్ షోయింగ్ విధానంలో వరుసగా నాట్లు వేయడం వలన వరి పంటలో తెగుళ్లు, పురుగుల బారిన పడే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. ఈ పద్ధతి ద్వారా మంచి ఆరోగ్యకరమైన దిగుబడిని సాధించవచ్చునన్నారు. వరి పంటలో రాజీలేని సూత్రాలు పాటిస్తే రైతులు ఆశించిన ఫలితాలను తప్పకుండా పొందగలరన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన పెరగడమే కాకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై ఆసక్తి మరింతగా కలుగుతుందన్నారు.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి

శ్రీకాకుళం సిటీ : పింగళి విగ్రహానికి నివాళ్లర్పిస్తున్న నాయకులు

ఇచ్ఛాపురం : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కృష్ణమూర్తిరెడ్డి

లావేరు : విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న గ్రంథాలయాధికారి

కవిటి : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఉపాధ్యాయులు

లావేరు: భారత జాతీయ పతాక రూపకర్త, తెలుగు జాతి కీర్తి కెరటం పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా శనివారం లావేరు శాఖా గ్రంథాలయంలో ఆయన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత పింగళి వెంకయ్య చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయోద్యమంలోనే కాకుండా విద్య, శాస్త్రీయ రంగాల్లో కూడా దేశానికి సేవలు అందించిన పింగళి వారి బహుముఖ సేవలను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రథమ బహుమతిని గ్రంథాలయాధికారి అందజేశారు. కార్యక్రమములో లిటిల్ స్కూల్ కరస్పాండెంట్ నీలిమ, ప్రిన్సిపాల్ బాలరాజు, గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ: జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య అందించిన దేశభక్తి నేటి సమాజానికి ఆదర్శమని తెలుగు మహిళా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొండు స్వాతి అన్నారు. స్థానిక గాంధీ మందిరం ఆవరణలో పింగళి వెంకయ్య 147వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పింగళి వెంకయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు డాక్టర్ పైడి సింధూర, నిర్వాహకులు జామి భీమశంకర్, నటుకుల మోహన్, కొంక్యాన వేణుగోపాల్, హారికాప్రసాద్, డాక్టర్ మందుల మోహనరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో పింగళి వెంకయ్య చిత్రపటానికి చైర్మన్ డి.కృష్ణమూర్తి రెడ్డి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ కె.సి.పూర్తి, ఉపాధ్యాయులు సురేఖ, శాంతి, జయలక్ష్మి, మీనా, సరోజిని, పార్వతి, స్నేహ, ప్రమీల ఇంటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ మోహన్‌ప్రియ, సెక్రటరీ డి.హర్షవర్ధన్‌రెడ్డి, ఎస్‌పిఎల్ జిహారిక పాల్గొన్నారు.

నరసన్నపేట: స్వాతంత్ర సమరయోధులు, భారత జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య ఆదర్శప్రాయులని కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు చింతాడ లక్ష్మణరావు అన్నారు. శనివారం పింగళి వెంకయ్య 147వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా అఖండ భరతావనిలో సగర్వంగా ఆవిష్కృతమయ్యే మువ్వన్నెల జాతీయ పతాకాన్ని రూపొందించి తెలుగు వ్యక్తి కావడం గర్వకారణం అన్నారు. సాంఘికశాస్త్ర ఉపాధ్యాయ ఫోరమ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాడాన రాజు మాట్లాడుతూ నాటి స్వాతంత్ర్య పోరాటంలో తమ ధన, ప్రాణాలను త్యాగం చేసిన వెంకయ్య వంటి త్యాగధనుల చరిత్రను నేటి విద్యార్థులు తెలుసుకొని దేశ భక్తిని పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహిని, వెంకటరమణ, నారాయణరావు, శ్రీహరిరావు, శాంతి, హేమలత, జగన్, బాడాన రాజు, వేణుగోపాలరావు, రాజేశ్వరరావు, రఫీ, కళావతి, సూర్యకుమారి పాల్గొన్నారు.

కవిటి: ఆర్ష విజ్ఞాన భారతి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎం.అనిల్ పింగళి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో శిరీష, ఢిల్లీరావు, సుహాసిని, జ్యోతి, అంజలి, రాజేశ్వరి, కృష్ణకుమార్, మాదికమ్మా లక్ష్మి, సరిత, నిర్మల, ధర్మారావు, ఝాన్సీ పాల్గొన్నారు.

బాబును నమ్మితే మోసం గ్యారంటీ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

చంద్రబాబు నమ్మినవాళ్లకి మోసం గ్యారంటీ అని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు, వైసిపి జిల్లా సాంస్కృక విభాగం అధ్యక్షులు ఉప్పరపల్లి ఉదయ్ కుమార్ అన్నారు. మండలంలోని పల్లిసారథిలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెన్నుపోటు రాజకీయాలకు చంద్రబాబు పెట్టింది పేరు అన్నారు. కూటమి ప్రభుత్వం పాలన హామీల అమలు తీరు ప్రజలు గమనించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి ఉప్పరపల్లి నీలవేణి, వైసిపి జిల్లా కార్యదర్శి దువ్వాడ మధుకేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షుడు తిర్రి రాజారావు, విద్యాసాగర్, హేమంత్ పాల్గొన్నారు.

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 18వ వార్డులో పట్టణ వైసిపి అధ్యక్షులు శిష్టు గోపి ఆధ్వర్యాన బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు కౌన్సిలర్ గుజ్జు జోగారావు, వైస్ చైర్మన్ బోర బుజ్జి, కౌన్సిలర్ సనపల సింహాచలం, కర్రి మాధవరావు, నర్తు వెంకటరమణ, పి.హరిప్రసాద్, కె.చిన్నబాబు పాల్గొన్నారు.

రణస్థలం : చంద్రబాబు మోసాలను వివరిస్తున్న వైసిపి నాయకులు

రణస్థలం: మండలంలోని కృష్ణాపురం, గోసాం, మహంతిపాలేం, రణస్థలం తదితర గ్రామాల్లో ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో బాబూ ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని వైసిపి రణస్థలం మండల అధ్యక్షులు గొర్లె శ్రీనివాసరావు శనివారం నిర్వహించారు. ముందుగా ఆయా గ్రామాల్లో స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ప్రజల వద్దకు వెళ్లి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయించి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వీడియో రూపంలో వివరించారు. ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చెప్పిన మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోయారన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న జనసేన నాయకులు

ఆర్థికసాయం

నందిగాం : మండలంలోని పెద్దగురువులలో గత నెల 28న అగ్ని ప్రమాదంలో పెద్దింటి జానికిరావు రేకుల ఇల్లు కోల్పోయింది. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కూరాకుల యాదవ్ కుటుంబంతో మాట్లాడి ఆర్థిక సహాయం, దుస్తులు, నిత్యవసర సరుకులు, కూరలు శనివారం అందించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు లక్ష్మీపురం కిరణ్, కె.అరుణ్, ఎస్.కుమారస్వామి, కిల్లి అప్పారావు పాల్గొన్నారు.

విరివిగా రుణాలు

ఇచ్ఛాపురం : మహిళా స్వయంశక్తి సంఘాలకు కావాల్సిన రుణాల కోసం సూక్ష్మరుణ ప్రణాళికలు పెండింగ్ లేకుండా అప్రూవల్ ఇచ్చి విరివిగా రుణాలు అందించాలని డిఎల్‌డిఎం శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాయింట్ మండల స్థాయి బ్యాంకర్ల సమావేశం సెర్ప్ ఎపిఎం ప్రసాదరావు ఆధ్వర్యాన నిర్వహించారు. రైతులకు, కౌలుదారులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా కావాల్సిన రునాలు అందించాలని సూచించారు. సమావేశంలో కవిటి, ఇచ్ఛాపురం మండలాల బ్యాంకుల మేనేజర్లు లీలంత మిశ్రా, ఎఐలు అజయ్‌కుమార్, శ్రీదేవి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎల్‌డిఎం శ్రీనివాసరావు

డిసెంబరు 31లోగా ఇళ్ల నిర్మాణాలు

కవిటి: ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పిఎంఎవై) పథకం కింద 2019-24 మధ్యకాలంలో నిర్మాణం ప్రారంభించిన అన్ని ఇళ్ల నిర్మాణాలు డిసెంబరు 31 నాటికి పూర్తిచేయాల్సిన అవసరం ఉందని పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు చెన్నూరు మల్లేశ్వరరావు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. వివిధ దశల్లో నిర్మాణం ఆగిపోయిన ఇళ్లను గుర్తించి, మళ్లీ నిర్మాణ పనులను పున్ణప్రారంభించాలని సూచించారు. ఇందుకోసం ప్రభుత్వం అదనంగా సహాయాన్ని అందించిందని తెలిపారు. అందులో భాగంగా ఎస్సిలకు రూ.50 వేలు, ఎస్‌టిలకు రూ.75 వేలు, ఆదివాసి గిరిజనులకు రూ.లక్ష అదనంగా మంజూరు చేశామని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులు నిర్మాణం ప్రారంభించకుండా నిర్లక్ష్యంగా ఉంటే పట్టాలు రద్దు చేస్తామని హెచ్చరించారు. అదనపు ఆర్థిక సహాయం పొందిన వారు ఇళ్లు నిర్మించలేకపోతే ప్రభుత్వం నుంచి అందిన డబ్బులు తిరిగి చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ పథకానికి సంబంధించి ఎవరికైనా సందేహాలు, సమస్యలు ఉన్నా నేరుగా తన ఫోన్ నంబరు 99492 56501కు సంప్రదించవచ్చని తెలిపారు.

మల్లేశ్వరరావు

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని సంచాం గ్రామంలో వైసిపి నాయకులు పతివాడ అప్పల నాయుడు అనారోగ్యంతో భాదపడుతున్నారని తెలుసుకొని శనివారం ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే, సమన్వయ కర్త గొర్లె కిరణ్ కుమార్ వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. అలాగే అదే గ్రామంలో వైసిపి నాయకులు మీసాల చక్రధం "(శ్రీహరి) అనారోగ్యంతో భాదపడుతున్నారని తెలుసుకొని పరామర్శించారు. అలాగే వేల్పురాయిలో మాజీ సర్పంచ్ యలకల బుచ్చినాయుడు అనారోగ్యంతో భాదపడుతున్నారని తెలుసుకొని ఆయనను పరామర్శించారు. అలాగే అదే గ్రామంలో వైసిపి నాయకులు గురాన అప్పలస్వామి అనారోగ్యంతో భాదపడుతున్నారని తెలుసుకొని ఆయనను పరామర్శించారు. అలాగే జీరుపాలెంలో మైలపల్లి లక్ష్మమ్మ ఇటీవల స్వర్గస్తులైనారని తెలుసుకొని ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే పాతర్లపల్లి గ్రామానికి చెందిన రణస్థలం మాజీ జెడ్‌పిటిసి గొర్లె లక్ష్మణరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి మరణించారు. వారి స్వగృహానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. లక్ష్మణరావు చిత్రపటానికి పుష్పాంజిలి ఘటించి నివాళ్లర్పించారు. అనంతరం ఆయన మతిపై ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈయనతో పాటు వైసిపి మండల అధ్యక్షులు గొర్లె శ్రీనివాసరావు, సర్పంచ్ గొర్లె రాధాకృష్ణ, గొర్లె మంగమ్మగారి రమణ, గొర్లె రామారావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు ఫీజు మినహాయింపు

ప్రజాశక్తి- రణస్థలం

గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేస్తున్న సీనియర్ సిటిజన్ కార్డు సర్వీసుకు దరఖాస్తు ఫీజును ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. ఇప్పుడు ఎటువంటి దరఖాస్తు ఫీజు చెల్లించకుండానే ఉచితంగా సర్వీసును ప్రజలు పొందవచ్చు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సీనియర్ సిటిజన్లకు కార్డులు అందించే కార్యక్రమం చేపట్టింది. రాష్ట్రంలో 60 ఏళ్లు నిండిన వృద్ధులందరికీ డిజిటల్ కార్డులు అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో సీనియర్ సిటిజన్ కార్డు పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చు.

సీనియర్ సిటిజన్ కార్డు

దేశవ్యాప్తంగా చెల్లుబాటు

సీనియర్ సిటిజన్ కార్డుతో దేశవ్యాప్తంగా ఎక్కడైనా ప్రభుత్వ సేవలను సులభంగా, వేగంగా పొందవచ్చు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందేందుకు ఈ కార్డు ఉపయోగ పడుతుంది. సీనియర్ సిటిజన్ కార్డు లేనివారు గ్రామ, వార్డు సచివాలయాలతో పాటు మీసేవ, ఇంటర్నెట్ కేంద్రాల్లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కార్డు ఉంటే ప్రభుత్వ గుర్తింపు పత్రాలు చూపాల్సిన అవసరం లేకుండానే ప్రయోజనాలను పొందవచ్చు. దేశ వ్యాప్తంగా వివిధ రకాల సేవలు పొందేందుకు వీలుగా 60 ఏళ్లు దాటిన వారికి సీనియర్ సిటిజన్ కార్డులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్నాయి. ఈ కార్డు ఉంటే ప్రతిసారీ వయసు ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సిన అవసరం ఉండదు. సీనియర్ సిటిజన్ కార్డు ద్వారా ఆ వ్యక్తి వయసు ఎంతో తెలుస్తోంది. ప్రతిసారి ఆధార్ లేదా ఇతర ప్రభుత్వ గుర్తింపు కార్డులు రుజువుగా చూపించాల్సిన అవసరం లేకుండా ఈ కార్డు ఉపయోగపడుతుంది. ఈ కార్డు ద్వారా ఆర్‌టిసి బస్సుల్లో 25 శాతం రాయితీ కల్పిస్తారు.

తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

కింతలిలో 'తొలి అడుగు'

ప్రజాశక్తి- పొందూరు

మండలం కింతలిలో శనివారం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నదీ లేనిది అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడి రాంప్రసాద్, ఎంపిటిసి కూటికుప్పల హనుమంతురావు, మాజీ సర్పంచ్ దవల గణపతిరావు, మాజీ ఎంపిటిసి రమణ, టిడిపి నాయకులు అసిరినాయుడు, ఉమా, శ్రీనివాసరావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కారాదు

ప్రజాశక్తి- పొందూరు

మత్తు పదార్థాలకు యువత బానిస కారాదని ఎస్ఐ వి.సత్యనారాయణ అన్నారు. మండలం దల్లిపేటలో శనివారం సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలిసీ తెలియని వయసు నుంచే డ్రగ్స్, మత్తుపదార్థాలు, మద్యం వంటి వాటికి యువత బానిసై తమ బంగారు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. పిల్లలు ప్రవర్తనను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని సూచించారు. అనంతరం పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

మొక్క నాటుతున్న విద్యార్థి

అమ్మ పేరున మొక్క

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పుట్టినరోజు సందర్భంగా విద్యార్దులు వారి అమ్మ పేరున పాఠశాలలో మొక్కలు నాటుతూ ఇతర విద్యార్దులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. మండలంలోని నగరంపల్లి హైస్కూల్ శనివారం విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. పదో తరగతి విద్యార్థిని బి.మంజుల వాళ్ల అమ్మ మోహిని పేరు మీదుగా పాఠశాలలోని జాతీయ హరిత దళ క్లబ్ ఆధ్వర్యాన పనస మొక్క నాటింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ తల్లితండ్రులపై తమ ప్రేమను చాటుకునే అవకాశం పిల్లలుకు కలుగుతుందన్నారు. కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు తలగాన హేమరావు, ఎన్‌జిసి క్లస్టర్ సమన్వయకర్త, సైన్స్ ఉపాధ్యాయులు కొయ్యల శ్రీనివాసరావు, పిఎంసి చైర్మన్ బి.లక్ష్మీపతి పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న గోపాల్

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవాలి

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పట్టణీకరణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగం తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ అన్నారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో శనివారం ప్లాస్టిక్ నిర్మూలన చేయాలని కమిషనర్ ఎన్.రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగించిన ప్లాస్టిక్ విచ్చలవిడిగా రోడ్లపైన వేస్తున్నారని, వీటి ద్వారా జల, వాయు కాలుష్యం పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ తిని పశువులు అనారోగ్యానికి గువుతున్నాయని, దీనిని నియంత్రణ చేయాలని కోరారు. వినతి పత్రం అందజేస్తున్న వారిలో గ్రీన్‌ఆర్మీ ఉపాధ్యక్షులు పొట్నూరు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు మోస హరినాథ్ పాల్గొన్నారు.

పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

పలాస: ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్నచౌదరి కోరారు. ఈ మేరకు ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు గృహంలో పలాస క్లస్టర్ టిడిపి నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్నీ గ్రామాలు, వార్డుల్లో సూపర్ సిక్స్ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. వైసిపి నాయకులు చేసిన అభివృద్ధిని స్వాగతించలేకపోతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో లొడగల కామేశ్వరరావు యాదవ్, గాలి కృష్ణారావు, మల్లా శ్రీనివాస్, యవ్వారి మోహనరావు, ఎం.నరేంద్ర, దువ్వాడ శ్రీకాంత్, గురిటి సూర్యనారాయణ, కొత్త సత్యం, సవర రాంబాబు, జోగ మల్లి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకన్న చౌదరి